క్లుప్తంగా

దేవతా విగ్రహాలకు పూజలు

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డలో కొత్త దేవాలయ నిర్మాణం కోసం శనివారం గ్రామంలోని శివాలయం, హనుమాన్ దేవాలయాలలో పూజలు చేశారు. దేవాలయ నిర్మాణం అవుతున్నందున ప్రస్తుతం ఉన్న దేవతా మూర్తులను తొలగించారు. నూతన శివాలయం, హనుమాన్ దేవాలయం ప్రత్యేక పూజల్లో కులమతాలకు అతీతంగా భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన ప్రజాప్రతినిధులు

కొల్లాపూర్: పట్టణంలోని 20వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు శనివారం పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు అంశాలపై స్థానికులతో మాట్లాడారు. వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. 18వ వార్డులో కౌన్సిలర్ కర్నె అలివేల పర్యటించారు. విద్యుత్ స్తంభాల పనులను పరిశీలించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఉప్పునుంతల: మండలంలోని సూర్యతండాలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను శనివారం సర్పంచ్ బాలునాయక్, అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేష్ తదితరులు ప్రారంభించారు. తండాలోని రెండు వీధుల్లో 250 మీటర్ల మేర సీసీ రోడ్డు వేయనున్నామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలలకు పంపండి

లింగాల: బడీడు పిల్లలను పనిలో కాకుండా పాఠశాలకు పంపాలని శనివారం ఎస్వీకే ఆధ్వర్యంలో మండలంలోని శాయిన్‌పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం పాఠశాలలో అన్ని సదుపాయాలను కల్పిస్తూ విద్యను ప్రోత్సహిస్తుందని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో ఇంగ్లిష్ మీడియం బోధన అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీకే ఆర్గనైజర్లు మన్సూర్, ప్రమీల, ఉపాధ్యాయులు రవి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

అమ్రాబాద్: పదర మండల కేంద్రంలో ఊర కుక్కల దాడిలో ఐదు గొర్రె పిల్లలు మృతి చెందాయి. చెక్క బాలయ్యయాదవ్ శుక్రవారం రాత్రి గొర్రె పిల్లలను పాలు తాపించి వాటిని పాకలో ఉంచాడు. తెల్లవారుజామున చూసేసరికి ఐదు గొర్రె పిల్లలను కుక్కలు చంపాయని తెలిపాడు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ కార్యాలయం వెనుక అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఓ ప్రార్థనా మందిరంపై చర్యలు తీసుకోవాలని శనివారం వీహెచ్‌పీ నాయకులు కమిషనర్ అశ్రిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో అనుమతి లేకుండా ప్రార్థన మందిరాల నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దయాకర్, గిరిధర్‌రెడ్డి, వివేకానంద, నర్సింహ, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్‌లో ఈదుల చెరువు కబ్జాకు గురికావడంతో ఇరిగేషన్ ఏఈ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం హద్దులు వేశారు. కాగా గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఎలాంటి సమాచారం లేకుండా హద్దులను తొలగించి ఇష్టానుసారంగా మాట్లాడాడని ఏఈ శనివారం పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన



కందనూలు: చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శనివారం మండలంలోని కుమ్మెరలో రావేఫ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా హోం సైన్స్ విద్యార్థులు రాగి లడ్డు, జొన్న మురుకు, కొర్రల కిచిడి వివిధ రకాల చిరుధాన్యాల వంటకాలు మహిళల ఎదుట ప్రదర్శించారు. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే చిరుధాన్యాలు ప్రతి ఒక్కరు ఆహారంలో భాగం చేసుకోవాలని వివరించారు. అనంతరం గ్రామంలో పాఠశాలలో విద్యార్థులతో డిబేట్, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, రోల్ ప్లే వంటివి నిర్వహించి, గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైష్ణవి, కరుణ, భవ్యశ్రీ, అఖిల, సాయి సంపద, హరిదీప్, కరుణశ్రీ, రిష్విక, అమీనా తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా నిలిచిన పనులు

- డబుల్ రోడ్డు పనుల్లో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కాంసానిపల్లి వద్ద నిలిపేసిన బీటీ డబుల్ రోడ్డు పనులు

ఉప్పునుంతల: రెండు పెద్ద వాహనాలు ఇరువైపుల రోడ్డు పనులు చేస్తుండటం, టిప్పర్లతో కంకర వేస్తుండటం.. ఆ పనుల ఆర్భాటం చూస్తుంటే నెలా, రెండు నెలల్లో చింతపల్లి నుంచి ఉప్పునుంతల వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తవుతుందని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు సంతోషపడ్డారు. ఆ పనుల ఆర్భాటం నాలుగు రోజులు చూపించిన కాంట్రాక్టర్ అర్ధంతరంగా నిలిపేశాడు. దీంతో ఆ మార్గంలో వెళ్లడానికి వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. వంగూరు మండల కేంద్రం నుంచి వయా చింతపల్లి మీదుగా మండల కేంద్రం వరకు 18 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు కోసం రూ.22 కోట్లు మంజూరయ్యాయి. అందులో భాగంగా రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ ఆర్భాటంగా పనులను ప్రారంభించాడు. చింతపల్లి బ్రిడ్జి నుంచి కాంసానిపల్లి వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ బీటీరోడ్డును డబుల్‌గా విస్తరించడానికి రోడ్డుకు ఇరువైపుల మట్టిని తీసి కంకర నింపిపెట్టారు. కొన్ని చోట్ల కంకర పొర కూడా సరిగా నింపకుండా వదిలేశారు. దీంతో పాటు కల్వర్టుల విస్తరణ కోసం గోతులు తీసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

హైదరాబాద్‌కు తగ్గనున్న దూరం

అచ్చంపేట నుంచి హైదరాబాద్ వెళ్లడానికి దూరం తక్కువ కావడంతో ఈ మార్గంలోనే నిత్యం వాహనాలు ఎక్కువగా వెళ్తుంటాయి. మండల కేంద్రం నుంచి చింతపల్లి బ్రిడ్జి వరకు దాదాపుగా 7 కిలోమీటర్ల దూరం మాత్రమే సింగిల్ బీటీ రోడ్డు ఉండటం, రోడ్డు సరిగా లేకపోవడంతోనే కొన్నేళ్లుగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డు కూడా ప్రస్తుతం డబుల్ రోడ్డు కోసం నిధులు మంజూరు కావడం, పనులు ప్రారంభించడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు సంతోషపడుతున్నారు. పనులు నిలిపేయడంతో అసహనం వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనులు పూర్తి చేయించడానికి కృషిచేస్తున్నాం

మండల కేంద్రం నుంచి చింతపల్లి వరకు డబుల్ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయించడానికి కృషిచేస్తామని ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మీపతి తెలిపారు. రోడ్డు పనుల్లో కొన్ని చోట్ల అవంతరాలు తలెత్తడంతో పనులు నిలిపేశారు. ప్రస్తుతం చింతపల్లి నుంచి వంగూరు వరకు పనులు చేస్తున్నారు. దాదాపుగా మెటల్ వేయడం పూర్తి కావొచ్చింది. త్వరలోనే ఇక్కడ పనులు తిరిగి కొనసాగిస్తారు. ఉప్పునుంతల నుంచి మూడు కిలోమీటర్ల దూరం ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతినం, చవుడు భూములు కావడంతో ఉన్న రోడ్డు కొంతమేర తొలగించి కొత్తగా మెటల్ వేసి ఆపైన బీటీ రోడ్డు వేయించగలమని ఏఈ తెలిపారు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



వెల్దండలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తిరూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి పేద, మధ్య తరగతి ప్రజలకు వరంలాంటిదని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కురుమిద్దెకు చెందిన ప్రభావతికి రూ.60 వేలు, గట్టుఇప్పలపల్లి అంజయ్యకు రూ.6వేలు, అంతారం వెంకటయ్యకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు.

వెల్దండ: మండలంలోని కేస్లీతండా పంచాయతీలోని మూడు మిద్దెలతండా చెందిన గమ్లీకి సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరు చేసిన రూ.లక్ష చెక్కును శనివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌నాయక్, శ్రీనునాయక్, నాగయ్యగౌడు తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: సాతాపూర్ చెందిన వరలక్ష్మికి రూ.20వేలు, కుర్మయ్యకు రూ.32 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరమేష్ అందజేశారు.

వైఎస్సార్‌టీపీలో చేరిక



వెల్దండ: మండలంలోని నారాయణపూర్ చెందిన యువకులు శనివారం వైఎస్సార్‌టీపీలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ అర్జున్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజన్న రాజ్యం తేవడానికి వైఎస్ షర్మిల కృషి చేస్తుందన్నారు. ఆమెకు మద్దతుగా ఉండాలన్నారు. అనంతరం ఆయా పార్టీలకు చెందిన యువకులు కండువా కప్పారు. కార్యక్రమంలో భాస్కర్, సంతోష్, సందీప్, చరణ్, కృష్ణ, శ్రీకాంత్, జంగయ్య, శ్రీధర్, పవన్, కొండల్, శ్రీనివాస్‌గౌడ్, విజయ్, సాయి తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని వినతి



కోడేరు: మండల ఎస్‌ఐ నరేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ ఈనెల 23న పోలీస్‌స్టేషన్‌లో రైతుల విషయం మాట్లాడేందుకు వెళ్తే.. అగౌరవపర్చి దూషించాడని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పట్టాభికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలిక్, బుచ్చన్న, రవి, శివుడు పాల్గొన్నారు.

పరామర్శ

లింగాల: మండలంలోని జీల్గుపల్లికి చెందిన అలివేల అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలికి ముగ్గురు చిన్నారులు ఉన్న విషయం తెలుసుకున్న ఆయన రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతు దెంది రమేష్‌రెడ్డి కుటుంబాన్ని శనివారం సాయంత్రం అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

కొత్త పాస్‌బుక్కులు ఇవ్వండి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

తాడూరు: ధరణి పోర్టల్‌లోని తప్పులను సరిచేసి రైతులకు కొత్త పాస్ బుక్కులను అందించాలని రైతు సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2017లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసమగ్ర సర్వే నేటికి రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. ఇనాం, గైరాన్, బంజరు భూములకు నోచుకోలేదన్నారు. ఆయా భూముల్లో రైతులు సాగు చేసుకుంటున్న కొత్త పాస్ బుక్కులు రాలేదని, దీంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తప్పుల తడకగా ఉండడం ఆయా బ్యాంకులలో రైతులు అప్పులు తీసుకోవడానికి ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. అనంతరం డీటీ మహిమూద్ అలీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుతుబుద్దీన్, బాలరాజు, ఎల్లయ్య, మల్లేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించినట్లు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగాల మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన రాధకు పురిటినొప్పులు రావడంతో ఈనెల 23న నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి ముగ్గురు శిశువులు ఉన్నట్లు గుర్తించి, సిజేరియన్ చేశారు. డెలివరీ అనంతరం ఒక ఆడశిశువును తల్లి వద్ద ఉంచి, ఇద్దరు శిశువులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. శనివారం డిశ్చార్జ్ చేసి తల్లి వద్దకు తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

కల్వకుర్తి మండలంలోని లింగసానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో, బెక్కెర ప్రాథమిక పాఠశాలలో, ఉప్పునుంతల మండలంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో, చారకొండ మండలంలోని చంద్రాయన్‌పల్లిలో ప్రాథమిక పాఠశాలలో, తాడూరు మండలంలోని చర్లతిరుమలాపురంలో ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి తోటి విద్యార్థులకు తరగతి గదిలో పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాడూరులో ఉపాధ్యాయులతో విద్యార్థులతో హెచ్‌ఎం



తిరుమలాపురంలో



కల్వకుర్తి మండలంలో..



ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో..

పనులను వేగంగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రుడు

తెలకపల్లి: 'మన ఊరు మన బడి' కింద కొనసాగుతున్న పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు. శనివారం మండలంలోని గట్టునెల్లికుదురు, గట్టురాయిపాకుల ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. 'మన ఊరు మన బడి' కార్యక్రమం కింద పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రగతిని నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

28న కళాశాలల విద్యార్థులకు ప్రతిభా పోటీలు



పోస్టర్లను విడుదల చేస్తున్న అధ్యాపకులు

కొల్లాపూర్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మల్లేశం తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. మానవ జీవితంలో సైన్స్‌పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలు, భారత రక్షణ వ్యవస్థ అంశంపై వక్తృత్వ, క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. ప్రతి కళాశాల నుంచి ఐదుగురు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు



జరిమానా విధిస్తున్న కమిషనర్ అశ్రిత్‌కుమార్

కల్వకుర్తి టౌన్: దుకాణాదారులు ప్లాస్టిక్ కవర్లు వాడినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పలు దుకాణాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న కవర్లను గుర్తించి వారికి జరిమానా విధించారు. మరోమారు కవర్లు దొరికితే భారీ జరిమానాలతో పాటుగా, మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని వారిని అన్నారు. శనివారం నిర్వహించిన తనిఖీలో నాలుగు దుకాణాదారులకు రూ.2వేల జరిమానా విధించినట్లు కమిషనర్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్, శివ, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కందనూలు: అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంను పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని సీయస్ఆర్ హైస్కూల్‌లో మిల్లెట్స్‌తో తయారు చేసిన రకరకాల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. పాఠశాల చైర్మన్ భాస్కర్‌రావు, చంద్రకళ హాజరై మాట్లాడారు. ఎన్నో వింత రోగాలతో బాధపడుతున్న ప్రపంచానికి మిల్లెట్స్ పరిష్కారం అని, శరీరానికి కావాల్సిన అన్ని రకాల పోషకాలు, విటమిన్లు, ఫైబర్, ఎమైనో ఆమ్లాలు, మినరల్స్ వంటివి పుష్కలంగా ఇందులో ఉంటాయన్నారు. విద్యార్థులు వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు.

317జీఓ కారకులకు గుణపాఠం చెప్పాలి



లింగాల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

లింగాల: ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన 317 జీఓ రావడానికి కారకులైన వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. శనివారం మండలంలోని లింగాల ఉన్నత పాఠశాల, గురుకుల, కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పెద్దల సభలో ప్రశ్నించేందుకు అవకాశం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో కృష్ణ, కొత్త శంకర్, రామచంద్రు, రాములు, బాబురావు, చందు, రవి, మల్లికార్జున్, బాలు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాడుదాం

కొల్లాపూర్ రూరల్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పోరాడుదామని యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. శనివారం మండలంలోని ఎన్మన్‌బెట్ల ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి పాపన్న గారి మాణిక్ రెడ్డి తరుపున ప్రచారం నిర్వహించారు.

జీవాల ఆరోగ్య సంరక్షణ ముఖ్యం



బండోనిపల్లిలో నట్టల నివారణ మందులను తాగిస్తున్న వైద్యుడు

బల్మూర్: జీవాల ఆరోగ్య సంరక్షణపై కాపరులు ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు పాటించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ తెలిపారు. సామూహిక గొర్రెల, మేకల నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండలం రామాజిపల్లిలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పరిశీలించారు. గొర్రెల కాపారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గొర్రెలు, మేకలు రోగాల బారిన పడకుండా ఏడాదిలో మూడు పర్యాయాలు నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తెలిపారు. రాష్ట్రంలో మాంసం వినియోగం అత్యధికంగా ఉన్నందున ఆరోగ్యకరమైన మాంసాన్ని వినియోగదారులకు అందించే బాధ్యత కాపారులపై ఉందన్నారు. అనంతరం ఆయన మండల కేంద్రంలో పశు వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు వెంకటేశ్వర్లు, మహేశ్వరి, సిబ్బంది మాధ్య, శ్రీను, శ్రీమంజు, సమ్రీన్, వెంకటేష్ పాల్గొన్నారు.

వెల్దండ: గొర్రెల, మేకల కాపారులు, రైతులు నట్టల నివారణ మందులను తాగించాలని పశువైద్య అధికారి శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బొల్లంపల్లి, బండోనిపల్లి, ఎంజీతండాలో నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు.